


నిమ్మపల్లిలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

## వంద రోజుల్లో ఉద్దెర పథకాలు

- బోనస్ హామీ బోగసైపోయింది..
- మళ్లీ కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మద్దు
- కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్
- కోనరావుపేట ముఖ్యకార్యకర్తల సమావేశానికి హాజరు

కోనరావుపేట, ఏప్రిల్ 2: పేదలను ఉద్ధరిస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్.. వంద రోజుల పాలనలో ఉద్దెర పథకాలతో మోసం చేసిందని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. క్వింటాల్ వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీ బోగసైపోయిందని ఎద్దేవా చేశారు. రైతులకు కరెంట్, నీరివ్వకుండా అరిగోస పెడుతున్నదని ఆరోపించారు. ఇక మతంపేరిట ఓట్లడుగుతున్న బండి సంజయ్..కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధికి నయాపైసా తేలేదని విమర్శించారు. మళ్లీ కాంగ్రెస్, బీజేపీని నమ్మి ఓటేస్తే నిండా మునగడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యకర్తలు కష్టపడి పనిచేసి ఉద్యమాల పురిటిగడ్డ కరీంనగర్‌పై గులాబీ జెండాను రెపరెపలాడించాలని పిలుపునిచ్చారు. పనిచేసిన కార్యకర్తలను కడుపులో పెట్టి కాపాడుకుంటామని పేర్కొన్నారు. మంగళవారం రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని సుద్దాల, కనగర్తి, నిమ్మపల్లి, బావుసాయిపేట గ్రామాల్లో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశాల్లో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కరువు ఛాయలు కమ్ముకోవడంతో పంటను నమ్ముకున్న రైతాంగం ఆగమవుతున్నదన్నారు. రేవంత్ సర్కారు చేతగానితనంతోనే అన్నదాతకు ఈ దుస్థితి దాపురించిందన్నారు. ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఐదేళ్లలో గుడి తెలేదు, బడి తెలేదు కానీ మత రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఈ తరుణంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు గడపగడపకూ వెళ్లి ఈ రెండు పార్టీల కపట నాటకాలను ఎండగట్టాలని సూచించారు.ఇక్కడ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, సింగిల్ విండో చైర్మన్లు బండ నర్సయ్య, సంకినని రామ్మోహన్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, మండలాధ్యక్షురాలు చీటి సంధ్య, యూత్ మండలాధ్యక్షుడు ముష్నం జీవన్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు, న్యాలకొండ రాఘవరెడ్డి ఉన్నారు.

### అభివృద్ధి ప్రదాతను ఆదరించాలె..

కాంగ్రెస్ నాయకులవి ఉత్త పథకాలు..ఉద్దెర మాటలు. కేసీఆర్ పాలనలోని మంచి మంచి పథకాలను ఎత్తేసి ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేశామని ప్రజలను మభ్యపెడుతున్నరు. మళ్లీ వారిని నమ్మితే అధోగతి పాలుకాక తప్పదు. ఇగ ఐదేండ్లు ఎంపీగా పనిచేసిన బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమీలేదు. మళ్లా ఓట్ల కోసం నాటకమాడుతున్నడు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి అలాంటి నాయకుడికి పట్టంగట్టాలె.

-చల్మెడ లక్ష్మీనరసింహారావు (వేములవాడ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి)



ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొప్పులఈశ్వర్, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

## కాంగ్రెస్ పాలనలో కన్నీరే మిగిలింది

- నష్టపోయిన రైతులపై నిందలు వేస్తున్న ప్రభుత్వం
- కేసీఆర్ హయాంలో ఒక్క ఎకరం కూడా ఎండలే..
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- జడ్పీ చైర్మన్ పుట్ట మధుతో కలిసి ఎండిన పంటల పరిశీలన

మంథని, ఏప్రిల్ 1: మూడున్నర నెలల కాంగ్రెస్ పాలన రైతులకు కన్నీరు మిగిల్చింది.. ఆదుకోవాల్సింది పోయి వారిపైనే అబండాలు వేస్తున్నది.' అంటూ పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్ మండిపడ్డారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో పుష్కలంగా సాగునీరు..నిరంతరం కరెంట్ ఇవ్వడంతో ఒక్క ఎకరం కూడా ఎండలేదని చెప్పారు. కానీ ప్రస్తుత సర్కారు అసమర్థతతో రైతాంగం నష్టపోయే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. మంగళవారం ఆయన పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి మంథని-గోదావరిఖని ప్రధాన రహదారి వెంట పోచమ్మవాడ సమీపంలోని ఎండిన వరి పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతులతో మాట్లాడి భరోసా కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ విప్లవాత్మక సంస్కరణలతో సాగును పండుగలా చేస్తే, అస్తవ్యస్త విధానాలతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వీర్యం చేస్తున్నాడని విమర్శించారు. సర్కారు కండ్లు తెరిచి ఎండిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల పరిహారం ఇవ్వాలని, ఈ యాసంగి వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తగరం శంకర్‌లాల్, ఎగోలపు శంకర్‌గౌడ్, పుట్ట ముకేశ్, పూదరి సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి కుమార్, ఎరుకల రవి, కనవేన శ్రీనివాస్ పాల్గొన్నారు.

### నీరివ్వడం చేతగాక సాకులు

మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు మూడు నెలలు కాకముందే రైతులను నిండా ముంచింది. యాసంగి పంటలకు నీరందక ఆగమైతున్న రైతుల బాధలను పట్టించుకోవడంలేదు. సీఎం రేవంత్, మంత్రులు ఓట్ల రాజకీయం చేస్తూ రైతుల కష్టాలను గాలికొదిలేశారు. గత సెప్టెంబర్, అక్టోబర్‌లో వానలు పడలేదని సాకులు చెబుతున్నరు. గత సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం 177.5 మీమీ కంటే అదనంగా ఉండగా 251.9శాతం నమోదైంది. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెడుతున్నది. నీళ్లు, కరెంట్ ఇవ్వడం చేతగాక రైతులపై అబాండాలు వేస్తున్నది.

- పుట్ట మధూకర్, జడ్పీ చైర్మన్ (పెద్దపల్లి)



### వరి మొత్తం నాశనమైంది

యాసంగి పంట సాగు చేసే ముందు కాలువల పొంటి నీళ్లు ఇచ్చిన్రు. నీళ్లత్తయనే ఆశకొద్ది నేను ఒక ఆరెకరాలు, మా అన్న ఏడెకరాల్లో వరి సాగు చేసినం. తీరా పంటలు మధ్యలకు అచ్చే సరికి నీళ్లయ్యకుండ మమ్మల్ని ఆగమాగం చేసిన్రు. గొలుసు దశలోకి పంట అచ్చే సరికి నీళ్లు రాక మేం సాగు చేసిన 13 ఎకరాలకు పైగా వరి మొత్తం నాశనమైంది. ఇద్దరం దాదాపు రూ.5 లక్షల పైగా నష్టపోయినం. గిట్లైతే ఎట్ల బతుకుడు. ఎన్నికల ముందు రైతుబంధు రూ.15 వేలు, కరెంటు, నీళ్లు ఇస్తమని చెప్పి మమ్మల్ని మోసం చేసిన్రు. నట్టేట ముంచిన్రు. ఇప్పటికి కూడా మాకింకా రైతుబంధు పడలేదు. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు మాకు రైతుబంధు ఎన్నడూ ఆపలేదు. నీళ్ల బాధ అంటే ఏందో కూడా తెల్వకుండ చేసిండు. కానీ, కాంగ్రెస్ వచ్చినంక రైతులు ఎవుసం చేయాలంటే ఆత్మహత్య చేసుకోడానికి సిద్ధం కావాల్సిందే అన్నట్టుగా మారింది. నీళ్లు లేక పంట మొత్తం పోయింది.. కనీసం పశువులకు గ్రాసం కూడా అచ్చే పరిస్థితులు లేవు.

- బిరుదు సువర్ణ మల్లయ్య, రైతు దంపతులు, పోచమ్మవాడ (మంథని)



పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలోని పొలంలో దిగాలుగా కూర్చున్న నూనెశంకర్

### కూలి చేసుకొని పెట్టుబడి పెట్టిన..



జంగల్ నాలా ప్రాజెక్టును నమ్ముకొని ఎవుసం చేసిన. నాకున్నది ఒక్క ఎకురమే. దానిపైనే నా జీవనాధారం. నాకున్న ఒక్క ఎకరాన్ని ఈ ఏడాది సాగు చేయద్దనే అనుకున్న. మునుపటి లెక్క నీళ్లు అత్తయి కదా అని ఆశపడ్డ. కూలీనాలీ చేసుకొని పెట్టుబడి పెడితే నోటికందేటప్పుడు నీళ్లు అందక పంట అంతా ఎండిపోయింది. జంగల్ నాలా ప్రాజెక్టు కింద నాలుగు వేల ఎకరాల సాగవుతాయి. ఇప్పటి వరకు 1200 ఎకరాల వరకు ఎండిపోయింది. ఇంకా నాలుగు రోజులయితే మొత్తం ఎండిపోతది. మమ్ములను ఆదుకునే నాథుడే లేడు. గతంలో కొప్పుల ఈశ్వర్ సార్ ఎస్సారెస్పీ కాలువ ద్వారా చెరువు నింపి పంటలకు నీరందించి ఆదుకున్నడు. ఇప్పుడు మమ్ములను పట్టించుకునే నాథుడే లేడు.

- సలాది బాబు, జగదేవుపేట. మండలం వెల్గటూర్

# అన్నదాత కన్నీటి గోస

## శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టులో సాగునీటి తండ్లాట



మధ్యమానేరు జలాశయంలో తేలిన భూములు

- ఎస్సారెస్పీలో అడుగంటుతున్న నీటినిల్వలు
- చివరి ఆయకట్టులో చేతికొచ్చే దశలో ఎండుతున్న పంటలు
- 'ఇదే చివరి తడి' అని అధికారుల ప్రకటనతో రైతుల్లో ఆందోళన
- వరదకాలువ పరీవాహక సాగు ప్రశ్నార్థకం
- చెరువులను నింపుకోలేని దుస్థితి
- పంటను చూస్తూ విలపిస్తున్న కర్షకులు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

**నిరుడు యాసంగిలో సంబురంగా సాగు చేసిన ఉమ్మడి జిల్లా రైతాంగం, ఇప్పుడు అరిగోస పడుతున్నది. ఎస్సారెస్పీ చివరి ఆయకట్టుకు నీరందక కన్నీరు పెడుతున్నది. కేసీఆర్ పదేండ్ల పాలనలో పుష్కలమైన జలాలతో బంగారు పంటలు పండించి సాగులో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచినా.. నేడు మాత్రం కండ్ల ముందే ఎండుతున్న పంటలను కాపాడుకోలేక తండ్లాడుతున్నది. 'మీరు పంటలు వేసుకోండి.. మేం నీళ్లిస్తాం' అని మాటిచ్చి మోసం చేయడాన్ని తట్టుకోలేక మండిపడుతున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుతోపాటు మిడ్‌మానేరు, ఎల్ఎండీలో నీటి నిల్వలు పడిపోవడం, వరదకాలువ వెలవెలబోవడం, చెరువులు కుంటలు అడుగంటుతుండడం చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నది. టేలెండ్ ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బ తినగా.. మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని భయపడుతున్నది. ఇది కాలంతో వచ్చిన కరువు కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువేనని స్పష్టం చేస్తున్నది.**

- రాజన్న సిరిసిల్ల/ కరీంనగర్, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ)

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతాంగం కరువు కోరల్లో చిక్కుకున్నది. నిరుడి వరకు ఏ చింత లేకుండా ఏడాదికి రెండు పంటలు తీసుకున్నా.. ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. ఎస్సారెస్పీ కింద కరీంనగర్ జిల్లాలో 1,86,905 ఎకరాలు, పెద్దపల్లి జిల్లాలో దాదాపు 1,82,699, జగిత్యాల జిల్లాలో 1,77,563 ఎకరాల ఆయకట్టు ఉండగా, ఈ జిల్లాల పరిధిలోని ప్రతి డిస్ట్రిబ్యూటరీ కింద వేలాది ఎకరాల్లో పంటలు ఎండి పోతున్నాయి. పోయిన యాసంగిలో పచ్చగా కనిపించిన భూములు నెర్రెలు బారి కనిపిస్తున్నాయి. చివరి ఆయకట్టులో చేతికొచ్చే దశలో దెబ్బతిన్నాయి. నీళ్లు రాకనే ఈ దుస్థితి తలెత్తిందని రైతులు భగ్గుమంటున్నారు. కాకతీయ ఎగువ కాలువ జోన్-1కు 3,500 క్యూసెక్కులు, జోన్-2కు 5,500 క్యూసెక్కులు విడుదల చేసినట్లయితే పూర్తి స్థాయిలో పంటలు చేతికి వచ్చేవని చెబుతున్నారు. అయితే ఇచ్చిన నీటిపై అజమాయిషీ లేక పోవడంతో మొదటి డిస్ట్రిబ్యూటరీల రైతులే వాడుకున్నారని, చివరి ఆయకట్టు వరకు నీరు రాలేదని ఆరోపిస్తున్నారు. పంటలను కాపాడుకునే దారిలేక పశువులను మేపుతున్నారు.

### ఏది నీటి ప్రణాళిక?

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో అన్ని డిస్ట్రిబ్యూటరీల పరిధిలో నీటిని విడుదల చేసేందుకు ప్రతి సీజన్‌లో నీటి పారుదల శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తారు, ఎస్సారెస్పీలో నీటి లభ్యతను బట్టి యాసంగికి నీరిచ్చేందుకు గత డిసెంబర్ 13న అధికారులు ప్రణాళికను ఖరారు చేశారు. అప్పటికీ ప్రాజెక్టులో 77.43 టీఎంసీల నీరు ఉండగా, ఆ మేరకు దాదాపు 94 డిస్ట్రిబ్యూటరీలకు 64.18 టీఎంసీల నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. నీటి విడుదల కోసం డీ1 నుంచి డీ 53 వరకు జోన్-1గా, డీ 54 నుంచి డీ94 వరకు జోన్-2 విభజించుకున్నారు. జోన్-1 3,500 క్యూసెక్కుల చొప్పున 7 రోజులు, జోన్-2 5,500 క్యూసెక్కుల చొప్పున 8 రోజుల పాటు సీజన్ మొత్తంలో 105 రోజులు నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా జోన్-1కు గతేడాది డిసెంబర్ 18న, జోన్-2కు డిసెంబర్ 25న నీటిని విడుదల చేశారు. ఒక్కో జోన్‌కు 7 విడుతల్లో నీటిని ఇచ్చారు. ఏప్రిల్ 6 వరకే నీటిని విడుదల చేయాలనేది అధికారుల ప్రణాళిక కాగా, ఎక్కడా సరైన రీతిలో అమలు కాలేదని, అనుకున్న విధంగా నీటిని విడుదల చేయలేదని రైతులు మండిపడుతున్నారు.

### అడుగంటుతున్న జలాశయాలు

పోయినేడు ఉమ్మడి జిల్లాలోని జలాశయాలు, చెరువులు జలకళతో దర్శనమిచ్చాయి. మండుటెండల్లోనూ చెరువులు, కుంటలు మత్తళ్లు దుంకాయి. కాలువలు గలగలా పారాయి. అయితే ఈ సారి మాత్రం భిన్న పరిస్థితులు ఎదురవుతున్నాయి. సాగునీటి ప్రణాళిక అమలు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సాగునీటి సమస్య తలెత్తింది. ఫలితంగా ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పూర్తిగా తగ్గిపోతున్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల వరకు వరదాయిని అయిన ఎస్సారెస్పీలో కేవలం 12.852 టీఎంసీల నీరు ఉన్నది. కాగా కాకతీయ కాలువకు ఆరువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నా పంటలు చేతికొచ్చే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. అయితే కాకతీయ కాలువ పరిధిలోని పంటలకు ఇదే చివరి తడి అని, మరో తడి నీరు ఇచ్చే పరిస్థితి లేదని, ప్రాజెక్టులో తాగునీటికి సరిపోయే నీరు సైతం సరిగా లేదని అధికారులు ప్రకటించడం భయపెడుతున్నది. మరో నీటి తడి వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆయకట్టు పరిధిలోని రైతాంగం ఆందోళన చెందుతున్నది. ఇటు పోయినేడు ఏప్రిల్‌లో శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) రిజర్వాయర్‌లో 20 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 7.7టీఎంసీలకు పడిపోయింది. గతేడాది మండుటెండల్లోనూ 32 అడుగుల నీటి నిల్వ సామర్థ్యంతో మత్తడి దుంకిన ఎగువ మానేరు, ఇప్పుడు 19 అడుగులకు పడిపోయింది. ఎల్ఎండీ పరిస్థితి కూడా దారుణంగా ఉన్నది. 24టీఎంసీలకు గాను ప్రస్తుతం 5టీఎంసీల నీరే ఉండగా, కాకతీయ కాలువకు నీటి విడుదలను ఇప్పటికే నిలిపివేశారు. ఇటు కరీంనగర్‌లో ఇప్పటికే తాగునీటి సమస్య మొదలు కాగా, కొన్ని డివిజన్లలో ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు.

### జీవం కోల్పోయిన వరదకాలువ

నాటి సమైక్య పాలనలో వట్టిపోయిన వరప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు కాళేశ్వర జలాలతో తిరిగి జీవం పోయడంతోపాటు వరద కాలువను జీవనదిలా మార్చే లక్ష్యంతో కేసీఆర్ సర్కారు ఎస్సారెస్పీ పునర్జీవ పథకాన్ని తెచ్చింది. కాళేశ్వర జలాలను ఎత్తిపోసి 122 కిలోమీటర్ల పొడవునా వరదకాలువను నిండుకుండలా మార్చింది. వరద కాలువకు తూములు ఏర్పాటు చేసి, వందలాది చెరువులు నింపుకొనే మార్గాన్ని సృష్టించింది. దీంతో పరీవాహక మండలాలైన ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కథలాపూర్, మేడిపల్లి, మల్యాల మండలాలకు మేలు జరిగింది. ఏప్రిల్, మేలో సైతం చెరువులు మత్తళ్లు దూకాయి. అయితే కాంగ్రెస్ సర్కారు మేడిగడ్డ బరాజ్‌లో మూడు పిల్లర్లకు పగుళ్లు వచ్చాయన్న సాకుతో చేతులెత్తేయగా.. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం వినియోగించలేని దుస్థితి వచ్చింది.



ఇల్లంతకుంట మండలం అనంతారంలో ఎండిన పంటను మేస్తున్న గొర్రెలు

### సిరిసిల్లలో జలగోస

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): కాళేశ్వర జలాల రాకతో సస్యశ్యామలమైన రాజన్న సిరిసిల్ల మెట్ట ప్రాంతం, కాంగ్రెస్ తెచ్చిన కరువుతో అల్లాడిపోతున్నది. అడుగంటిన భూగర్భ జలాలు.. నోళ్లు తెరిచిన బోర్లతో నీరందక ఎండిపోతున్న పంటను చూసి కన్నీరుపెడుతున్నది. సమైక్య రాష్ట్రంలో ఒకప్పుడు కరువుతో అల్లాడిన ఈ ప్రాంతం తెలంగాణ వచ్చిన తర్వాతే బాగుపడింది. స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఎస్సారార్‌ను పూర్తి చేసింది. ఈ క్రమంలో కాళేశ్వరజలాలు తరలివచ్చి మెట్టను సస్యశ్యామలం చేశాయి. ఆనాడు 60వేల ఎకరాలు ఉన్న సాగు విస్తీర్ణం రెండులక్షల ఎకరాలకు చేరింది. ఇలా దశాబ్దకాలంగా ఎవుసం సంబురంగా సాగినా, ఈ యాసంగిలో ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి నుంచే సాగునీటి సమస్య మొదలు కాగా, చెరువులు కుంటలు అడుగంటుతున్నాయి. వాగులు, వంకలు, కాలువలు వెలవెలబోతున్నాయి. పోయినేడు ఏప్రిల్‌లో ఎస్సారార్‌లో నీటి నిల్వ సామర్థ్యం 20 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 7.7టీఎంసీలకు పడిపోయింది. ఇక మండుటెండల్లోనూ 32 అడుగుల నీటి నిల్వ సామర్థ్యంతో కళకళలాడిన ఎగువ మానేరు, ఇప్పుడు 19 అడుగులకు పడిపోయింది. కాంగ్రెస్ సర్కారు మేడిగడ్డను సాకుగా చూపుతూ సాగునీరివ్వకుండా పంటలు ఎండబెడుతుండడంపై రైతులు నిప్పులు చెరుగుతున్నారు. ఇప్పటికే సాగునీరందక ఇల్లంతకుంట మండలం అనంతారం, సిరికొండ, పెద్దలింగాపూర్ గ్రామాల్లో 800 ఎకరాలు, చందుర్తి, వేములవాడ రూరల్ మండలాల్లో సుమారు 200 ఎకరాల వరి పంట ఎండిపోవడంతో ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం వల్లే పంటలు ఎండి పోయాయని మండిపడుతున్నారు. కాళేశ్వర జలాలతో మధ్యమానేరు, అన్నపూర్ణ, రంగనాయక్ సాగర్ ప్రాజెక్టులు నింపితే ఈ సమస్య వచ్చేది కాదని చెబుతున్నారు.




వెల్గటూర్ మండలం జగదేవ్‌పేటలో ఎండిపోయిన పొలాల్లో మేస్తున్న గొర్లు

### జగిత్యాలలో టేలెండ్ ప్రశ్నార్థకం

జగిత్యాల, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ): జగిత్యాల జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 2,97,654 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఎస్సారెస్పీ కాకతీయ కాలువ కింద 14 మండలాల పరిధిలో 1,77,563 ఎకరాల్లో పంటలు వేశారు. అయితే ప్రభుత్వ నిర్లక్ష్యంతో యాసంగి పంట ఇబ్బందికరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ఎస్సారెస్పీలో నీటి నిల్వలు తగ్గుతుండడం, సాగునీరు వచ్చే పరిస్థితి లేక టేలెండ్ (చివరి ఆయకట్టు) ప్రశ్నార్థకంగా మారుతున్నది. కాకతీయ కాలువకు ఆరువేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నా.. పంటలు దక్కే పరిస్థితి కనిపించడం లేదు. మరో తడి ఇస్తే గానీ పంటను రక్షించుకోలేమని, ఇప్పుడున్న పరిస్థితుల్లో మరో తడి వచ్చేలా లేదని, పంటలను కాపాడుకోవడం ఎలా అంటూ రైతాంగం వాపోతున్నది. ఇక చెరువులపై ఆధారపడి సాగు చేస్తున్న 58వేల ఎకరాల్లో వరి ఎండిపోయే ముప్పు కనిపిస్తున్నది. ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి ప్రాంతాలతో పాటు, వరద కాలువ పరీవాహక ప్రాంతంలో పంటలకు సాగునీరందక ఎండిపోతున్నాయి. డీ-83 కాలువ ద్వారా వచ్చే ఎస్సారెస్పీ నీరు ధర్మపురి మండలం పెగపడల్లి, గొల్లపల్లి, వెల్గటూర్ మండలాలకు చేరుతుంది. గొల్లపల్లి మండలం రంగధామునిపల్లిలో ఉన్న రిజర్వాయర్‌కు డీ-83 ద్వారా నీరు చేరుతాయి. అక్కడి నుంచి నీరు చిల్వకోడూరు వాగుగుండా ప్రయాణించి, దట్నూర్ గ్రామ పరిధిలో ఉన్న జంగల్‌నాలా ప్రాజెక్టుకు చేరుతుంది. జంగల్‌నాలాకు చేరిన నీరు దిగువన ఉన్న వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట, చెర్లపల్లి, కొండాపూర్, అంబారిపేట గ్రామాలకు చేరుతుంది. అయితే డీ-83కి పూర్తి సామర్థ్యంతో నీరు రాకపోవడంతో దానిపై ఆధారపడిన రంగధామునిపల్లి రిజర్వాయర్ పూర్తిగా వట్టిపోయింది. దీంతో చిల్వకోడూరు వాగు, జంగల్‌నాలా ప్రాజెక్టులు ఎండిపోయి, చిల్వాకోడూరు, దట్నూర్ గ్రామాలతో పాటు, వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట, చెర్లపల్లి, కొండాపూర్, అంబారిపేట గ్రామాల్లోని పంటలు ఎండిపోయాయి. ఇక వెల్గటూర్ మండలంలోని డీ-83/బీ, డీ-83/డీ కాలువలకు నీరు రాకపోవడంతో ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామాల్లో వేలాది ఎకరాలు ఎండిపోయాయి. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం లేకపోవడంతో వరద కాలువకు నీటిని కాళేశ్వరం నుంచి ఎత్తిపోయలేదు. దీంతో కథలాపూర్ మండలంలోని కథలాపూర్, పెగ్గెర్ల, భూషణ్‌రావుపేట, దుంపెట, దూలూరు గ్రామాల్లో వరిపంట ఎండిపోయింది. ఇవికాకుండా రాయికల్ మండలంలో చివరి ఆయకట్టు ప్రాంతాలైన ధర్మాజీపేట, కట్కాపూర్,చింతలూరు, కొత్తపేట గ్రామాల్లోను పంటలు దెబ్బతింటున్నాయి. సారంగాపూర్ మండలంలోని పోతారంలో పంటలు ఎండిపోయాయి. పెగడపల్లి మండలంలోని డీ-70 నుంచి మొదలుకొని డీ-83 వరకు ఉన్న డిస్ట్రిబ్యూటరీల్లో చివరి ఆయకట్టు ప్రాంతాలకు ఇబ్బందులు వస్తున్నాయి. లింగాపూర్, బతికెపల్లి, వెంగలాయిపేట గ్రామాల రైతులు అవస్థలు పడుతున్నారు.

### పెద్దపల్లిలో చివరి ఆయకట్టు అగమ్యగోచరం



ముత్తారం మండలం ఇప్పలపల్లిలోని పొలంలో మేస్తున్న ఎడ్లు

పెద్దపల్లి, ఏప్రిల్ 2(నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లా రైతాంగం గోసపడుతున్నది. చివరి భూములకు నీరందక కంటతడి పెడుతున్నది. డీ-83, 86 కెనాళ్ల కింద జిల్లాలో ఎస్సారెస్పీ కింద దాదాపు 1,82,699 ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఇంకా 1076 చెరువులు, కుంటల్లోకి ఎస్సారెస్పీ నీరు చేరి పంటలను కాపాడుతుంది. అయితే డీ-83 కాలువ కింద చొప్పదండి, ఎలిగేడు, జూలపల్లి, ధర్మారం, పాలకుర్తి, పెద్దపల్లి, కమాన్‌పూర్, అంతర్గాం, రామగుండం, కాల్వ శ్రీరాంపూర్, ముత్తారం, రామగిరి, మంథని మండలాల్లోని సుమారు 202 గ్రామాలకు సాగు నీరందుతుండగా, గత యాసంగిలో ఈ కాలువ కింద జిల్లాలో 1,03,339 ఎకరాలు సాగైంది. డీ-86 కాలువ కింద కరీంనగర్ రూరల్, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, ఎలిగేడ్, జూలపల్లి, పెద్దపల్లి మండలాల్లోని 86 వేల ఎకరాలకు సాగు నీరందుతుండగా, గత యాసంగిలో జిల్లాలో 79,360 ఎకరాలు సాగైంది. కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత ఏనాడూ సాగునీటికి ఇబ్బంది రాలేదు. నడి వేసవిలోనూ చెరువులు, కుంటలు మత్తళ్లు దూకి పంటలు పుష్కలంగా పండాయి. అయితే ఈ యాసంగిలో పరిస్థితి మారింది. అధికారులు నీళ్లు ఇస్తామని చెప్పడంతో పంటలు దండిగా సాగు చేసిన రైతులకు నిరాశే ఎదురైంది. చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. డీ-83 పరిధిలో పెద్దపల్లి మండలం మూలసాల, చీకురాయి, పెద్దకల్వల, రాంపల్లి, భోజన్నపేటల్లోని ఇప్పటికే 600 ఎకరాలు ఎండిపోయింది. కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి, కూనారం, మంగపేట, జాఫర్‌ఖాన్‌పేట, ఇద్లాపూర్ గ్రామాల దాకా ఉన్న సబ్ మైనర్ కాలువ పూర్తిస్థాయిలో పారక జాఫర్‌ఖాన్‌పేట-ఇద్లాపూర్ గ్రామాల మధ్య దాదాపు 300 ఎకరాలు, ముత్తారం మండలం సీతంపల్లి, ఇప్పలపల్లి గ్రామాల్లో 700 ఎకరాలు ఎండిపోయింది. మంథని మండలం కాకర్లపల్లి, సూరయ్యపల్లి, ఎక్లాస్‌పూర్, పుట్టపాక, కన్నాల, నాగారం, గుంజపడుగు, పోతారం గ్రామాల్లో దాదాపుగా 10వేల ఎకరాలకు తీరని నష్టంవాటిల్లింది. ఇక అంతర్గాం మండలం పెద్దంపేట్, విస్సంపేట గ్రామాల పరిధిలో దాదాపుగా 100ఎకరాలు ఎండిపోయాయి. ఇక పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లిలో దాదాపుగా 25ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇక ధర్మారం మండలం బొమ్మారెడ్డి పల్లిలో 50 నుంచి 100 ఎకరాల మేర చేతికి రాకుండాపోయాయి. మొత్తంగా 20వేల ఎకరాల్లో పంటలు ఎండిపోగా, పరిస్థితి ఇలాగే ఉంటే మున్ముందు మరో 50వేల ఎకరాల దాకా పంటలు ఎండే ముప్పు కనిపిస్తున్నది.